సాక్షి
ప్రకాశం
మంగళవారం । 30 । జనవరి । 2024



సంక్షేమ ప్రభుత్వంపై పచ్చ విషం

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్ ప్రభుత్వంపై ఎల్లో మీడియా అసత్య కథనాలతో విషం కక్కుతోందని మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. - 10లో..



జగనన్న మాట శిలాశాసనం

జగనన్న మాట ఇస్తే శిలాశాసనమేనని.. ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. - 10లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31/22

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

జాతీయ సమైక్యతా అవార్డు అందుకున్న ఏకేయూ డీన్



అవార్డు అందుకుంటున్న డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి

ఒంగోలు: మాజీమంత్రి డాక్టర్ మాణిక్య వరప్రసాద్ చేతులమీదుగా ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి అవార్డు అందుకున్నారు. విజయవాడలోని లయన్స్ ఇంటర్నేషనల్, ఎక్స్‌రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థలు సంయుక్తంగా హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో 2024వ సంవత్సరం జాతీయ సమైక్యతా అవార్డును ఆయన అందుకున్నారు. దేశభక్తి, జాతీయ సమైక్యతను పెంపొందించిన ఉయ్యాలవాడ నరశింహారెడ్డి, దేశభక్త కొండా వెంకటప్పయ్య, జిల్లా జాతీయోద్యమ త్యాగమూర్తులు వంటి రచనలు చేసినందుకుగాను డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఇప్పటి వరకు తన కెరీర్‌లో 35కు పైగా జాతీయ, అంతర్జాతీయ వ్యాసాలు ప్రచురితం కావడం, చరిత్ర, సాంస్కృతిక బోధనా విభాగాల్లో అనేక పాఠ్యపుస్తకాలకు సంపాదకత్వం వహించిన సందర్భంగా తనను ఈ అవార్డుకు ఎంపికచేయడం ఆనందంగా ఉందని వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు.

జిల్లాకు చేసిన సేవలు అభినందనీయం



జేసీ శ్రీనివాసరావును సన్మానిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి

కొత్తపట్నం: జిల్లాలో జాయింట్ కలెక్టర్‌గా వచ్చి, ప్రజలకు అనేక సేవలు చేసి, గొప్ప పేరు తెచ్చుకుని నంద్యాలకు కలెక్టర్‌గా పదోన్నతిపై వెళ్తున్న శ్రీనివాసరావును మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కొనియాడారు. మోటుమాల గ్రామంలో సోమవారం పట్టాల పంపిణీ కార్యక్రమం అనంతరం శ్రీనివాసరావుకు బాలినేని, శచీదేవి దంపతులు సత్కరించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ మన జిల్లాకు జేసీగా వచ్చిన తరువాత పట్టా భూముల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని త్వరితగతిన పూర్తి చేసి మంచి పేరు తెచ్చుకున్నారని గుర్తు చేశారు. పెండింగ్ పనులు కూడా వెంటనే చేసేవారని తెలిపారు.

ఉద్యోగుల భవిష్యనిధి సంస్థలో 'నిధి ఆప్‌కె నిఖత్'

ఒంగోలు సిటీ: జిల్లా ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ 'నిధి ఆప్‌కె నిఖత్' వార్షికోత్సవం ఒంగోలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎస్.శ్రీనివాసకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు 'నిధి ఆప్‌కె నిఖత్' చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పీఎఫ్ కమిషనర్ సతీష్‌కుమార్, జిల్లా నోడల్ అధికారి, పీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సమ్మయ్య, డీసీసీబీ జనరల్ మేనేజరు రాఘవయ్య, ప్రెసిడెంట్ మాధవరావు, జనరల్ కార్యదర్శి హనుమంతరావు, డీసీసీ బ్యాంకు ఉద్యోగులు, వివిధ సంస్థల యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

కందుల ఇంట టికెట్ల మంట

మార్కాపురం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే టికెట్ వ్యవహారం కందుల సోదరుల మధ్య చిచ్చు పెట్టింది. తనకు లేదా తన భార్యకు టికెట్ ఇవ్వాలని ప్రస్తుత పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందుల నారాయణరెడ్డి పట్టుపడుతుంటే.. గతంలో రెండుసార్లు ఓడిపోయారు కనుక ఈసారికి తనపేరు పరిశీలించాలని ఆయన సోదరుడు రామిరెడ్డి.. చంద్రబాబును కోరారు. ఈ వ్యవహారంతో పార్టీ శ్రేణుల్లో గందరగోళం నెలకొంది. మరోవైపు జనసేన నుంచి తనకు టికెట్ ఇస్తే పోటీ చేసి గెలుస్తానంటూ ఇమ్మడి కాశీనాథ్ పవన్‌కళ్యాణ్‌ను కోరినట్లు తెలుస్తోంది.

- టీడీపీలో టికెట్ రగడ
- కందుల సోదరుల మధ్య విభేదాలు
- భార్య పేరుతో మహిళా కోటాలో టికెట్ కోసం నారాయణరెడ్డి ప్రయత్నాలు
- మరోవైపు సోదరుడు రామిరెడ్డి కూడా టికెట్ కోసం పట్టు
- టికెట్టు ఇస్తే గెలుస్తానంటున్న జనసేన నేత కాశీనాథ్



కందుల రామిరెడ్డి | కందుల నారాయణరెడ్డి, టీడీపీ మాజీ ఎమ్మెల్యే | ఇమ్మడి కాశీనాథ్

ఒంగోలు సాక్షి ప్రతినిధి: పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం టీడీపీలో ముసలం మొదలైంది. కందుల సోదరుల మధ్య కుర్చీ కోసం అంతర్గత పోరు తీవ్రమైంది. ప్రస్తుత టీడీపీ ఇన్‌చార్జి కందుల నారాయణరెడ్డి 2009లో మార్కాపురం నుంచి పోటీ చేసి మొదటిసారి గెలుపొందారు. 2014లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి జంకె వెంకటరెడ్డి, 2019లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి ప్రస్తుత ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డిపై భారీ తేడాతో ఓటమి పాలయ్యారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మరో దఫా పోటీ చేసేందుకు సిద్ధమయ్యాడు. ఇదే సమయంలో ఆయన సోదరుడు మాజీ జెడ్పీటీసీ కందుల రామిరెడ్డి కూడా టికెట్ రేసులో ఉండటంతో కందుల సోదరుల మధ్య అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కందుల నారాయణరెడ్డికి టికెట్ ఇచ్చే విషయంలో విముఖత చూపడంతో నారాయణరెడ్డి తన భార్య పేరుతో వారంరోజుల క్రితం దరఖాస్తు పంపుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఇది హాట్‌టాపిక్‌గా మారింది. దీంతో రామిరెడ్డి కూడా టికెట్టు కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికి మూడు సార్లు పోటీచేసి ఒక్కసారి మాత్రమే నారాయణరెడ్డి గెలుపొందడంతో తనకు అవకాశం ఇవ్వాలని కుటుంబ సభ్యులతో రామిరెడ్డి చెప్పినట్లు తెలిసింది. ఈ ఒక్కసారి తాను పోటీ చేస్తానని నారాయణరెడ్డి గట్టిగా పట్టుబట్టాడు. అయితే అధినేత చంద్రబాబు దృష్టిలో గుడ్‌విల్ లేకపోవడంతో పాటు ఇటీవల రోడ్డు యాక్సిడెంట్‌కు గురై సరిగా నడవలేకపోవడం, ప్రజల్లో అనుకున్నంత సానుభూతి లేనట్లుగా చంద్రబాబు చేయించిన సర్వేలో బయటపడటంతో ఆయన ఈసారికి నువ్వొద్దులే.. అని చెప్పడంతో తనకు కాకపోయినా తన భార్యకైనా టికెట్ ఇవ్వాలని బాబును నారాయణరెడ్డి కోరినట్లు తెలిసింది. ఈ ప్రతిపాదనపై చంద్రబాబు నుంచి ఎటువంటి సానుకూల స్పందన రాకపోవడంతో కుటుంబంలో ఆందోళన మొదలైంది.

గందరగోళంలో టీడీపీ శ్రేణులు:

కాగా గెలుస్తామనే ధీమా లేకున్నప్పటికీ టికెట్ విషయంలో అన్నదమ్ముల మధ్య జరుగుతున్న విభేదాలతో మార్కాపురం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల్లో గందరగోళం నెలకొంది. టికెట్ విషయంలోనే విభేదాలుంటే రేపు అన్నదమ్ముల్లో ఒకరికి టికెట్ వస్తే మరొకరు సహకరిస్తారా అన్న ప్రశ్న కూడా కార్యకర్తల్లో తలెత్తింది. ఈ విభేదాలు పార్టీకి నష్టం చేకూర్చేలా ఉన్నాయని కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సందట్లో సడేమియా లాగా జనసేన నుంచి ఒత్తిడి:

టీడీపీలో టికెట్ విషయమై అన్నదమ్ముల మధ్య విభేదాలు బహిర్గతం కాగా సందట్లో సడేమియా లాగా మరో వైపు జనసేన ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్ పొత్తులో భాగంగా మార్కాపురం సీటు జనసేనకు ఇవ్వాలని, తాను పోటీచేసి గెలిచి పవన్‌కల్యాణ్‌కు గిఫ్ట్‌గా ఇస్తానని సోమవారం ప్రకటించడంతో టీడీపీ నేతల్లో ఆందోళన మొదలైంది. టికెట్ విషయంలో తమకు ఎదురులేరని భావిస్తున్న కందుల సోదరులకు కాశీనాథ్ వైపు నుంచి టికెట్ ఇవ్వాలనే ప్రతిపాదన రావడం ఎటువంటి పరిణామాలకు దారితీస్తుందన్న చర్చ జరుగుతోంది. కాశీనాథ్ 2019లో జరిగిన ఎన్నికల్లో జనసేన అభ్యర్థిగా మార్కాపురం నుంచి పోటీచేసి ఓటమి పాలయ్యారు. కాశీనాథ్ అభ్యర్థిత్వాన్ని ఒకవేళ పార్టీ పొత్తులో భాగంగా జనసేనకు మార్కాపురాన్ని కేటాయిస్తే ఎలా అన్న చర్చ విస్తృతంగా జరుగుతోంది. ఇప్పటి వరకూ జనసేన వైపు నుంచి ఎటువంటి ప్రతిపాదన రాకపోవడంతో కందుల నారాయణరెడ్డి టికెట్ తనకేనన్న ధీమాతో ఉన్నాడు.

కాశీనాథ్ కూడా ఇటీవల పవన్‌కల్యాణ్‌ను కలిసి మార్కాపురం అసెంబ్లీ స్థానాన్ని జనసేనకు కేటాయిస్తే తాను పోటీ చేస్తానని స్పష్టం చేశారు. మొత్తం మీద టికెట్ రగడ టీడీపీ, జనసేనలో విభేదాలు సృష్టిస్తోంది.

మీ రుణం తీర్చుకున్నా..

- మీ ఆనందం చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉంది
- 350 ఎకరాల్లో 250 మంది రైతులకు పట్టాల పంపిణీ
- ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



మోటుమాల ఉప్పు కొఠారు భూములకు పట్టాలు పంపిణీ చేస్తున్న బాలినేని, శచీదేవి, జేసీ శ్రీనివాసులు

మోటుమాల (కొత్తపట్నం): "మీకు పట్టాలు ఇవ్వటానికి ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యాయి. గ్రామానికి వచ్చినప్పుడల్లా పట్టాలు ఇవ్వాలని అడిగేవారు సమయం అనుకూలించింది, అధికారులు శ్రమించడంతో పాటు మీ కష్టం వృథా పోకుండా ఈ పట్టాలు ఇచ్చి రుణం తీర్చుకుంటున్నానని" మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఉప్పు కొఠార్ల భూముల పట్టా పంపిణీ కార్యక్రమాన్ని మోటుమాల గ్రామంలో సోమవారం నిర్వహించారు. సర్పంచ్ కోడూరి గోపి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ముందుగా బాలినేనికి ఘనస్వాగతం పలికి గ్రామ పొలిమేర ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు బైక్‌లతో ర్యాలీ చేసుకుంటూ సమావేశ ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మోటుమాల గ్రామం అంటే వైఎస్సార్ సీపీకి కంచుకోట అని, ఎప్పుడూ ప్రేమాభిమానాలు చూపిస్తారని కొనియాడారు. కోర్టులో ఉండటం వలన ఇంతకాలం పట్టాలు ఇవ్వటానికి వీలు కుదరలేదన్నారు. కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, జేసీ శ్రీనివాసులు, ఆర్డీవో విశ్వేశ్వరరావు, తహసీల్దార్ మురళి సహకారంతో పట్టాలు మంజూరు చేయగలిగామన్నారు. ఇంకా మిగులు భూములు కూడా సర్వే చేసి పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. జేసీ శ్రీనివాసులు మాట్లాడుతూ 40 ఏళ్ల గొడవలతో ఉన్న భూమిని పరిష్కరించి పట్టాలు ఇవ్వటం ఎంతో కష్టంతో కూడిన పని అని తెలిపారు. 350 ఎకరాల భూమిని కొలతలు కొలిచి 250 మందికి పట్టాలు ఇవ్వటం ఎంతో కష్టంతో కూడి పని అన్నారు. అసైన్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేసి, కమిటీలో ఆమోదం పొంది ఇవ్వటం వలన రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ పొలాన్ని 20 ఏళ్ల తరువాత రిజిస్ట్రేషన్ భూమిగా మార్చుకునే వెసులుబాటు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించడం సంతోషకర విషయమన్నారు. ఇప్పుడు పట్టాలు ఇచ్చే వారికి పట్టా, ఎఫ్ఎంబీ, వెబ్‌ల్యాండ్‌లో నమోదు, పాసుపుస్తకం, జగనన్న భూ పంపిణీ సందేశం ఐదు రకాల పత్రాలు మంజూరు చేస్తున్నామన్నారు. అనంతరం బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి, జేసీ చేతులతో పట్టాలు పంపిణీ చేశారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్నారు టీడీపీ నాయకులు

గ్రామ ప్రయోజనాలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలను నగరంలో, గ్రామీణ ప్రాంతాల్లో అడ్డుకుంటున్నారని బాలినేని శ్రీనివాసరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మోటుమాల గ్రామంలో హైస్కూల్ నిర్మించడానికి సర్వే నంబర్ 465ఏలో స్థలం కేటాయిస్తే దానిని కొంత మంది టీడీపీ నాయకులు అడ్డుకుని నిలుపుదల చేశారని మండిపడ్డారు. కోర్టుకు కూడా వేసి ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. నాడు-నేడు ద్వారా రూ.2 కోట్లు మంజూరు చేస్తే రెండేళ్ల నుంచి పనులు చేయనీయకుండా కోర్టుకెళ్లి నిలుపుదల చేశారని గుర్తు చేశారు. వచ్చిన రూ.2 కోట్ల నిధులు వెనుకకు వెళ్లే పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో ఒంగోలు ఎంపీపీ మల్లికార్జున్‌రెడ్డి, జిల్లా అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, తహసీల్దార్ మురళి, బీవీ రమణారావు, ఎంపీటీసీ సభ్యుడు పురిణి వెంకట్రావు, గొర్రెపాటి శ్రీను, మాజీ సర్పంచ్ పురిణి కృష్ణారెడ్డి, పురిణి బ్రహ్మారెడ్డి, మాజీ ఎంపీపీ వాయల మోహన్‌రావు, బలగాని శ్రీనివాసరావు, కోడూరి బ్రహ్మారెడ్డి, కోడూరి వెంకటరెడ్డి, శంకర్‌రెడ్డి, సీతారామయ్య, పాలచంద్రయ్య, అనిల్, సిద్దయ్య, పురిణి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా అభివృద్ధి



కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

- రానున్న ఎన్నికల్లో జగనన్నకు అండగా నిలవండి
- మరోసారి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేద్దాం
- సంతనూతలపాడులో కార్యకర్తల పరిచయ కార్యక్రమంలో మంత్రి మేరుగు నాగార్జున
- అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అధికారులతో సమీక్ష
- ఎన్నికల కోడ్ వచ్చే లోపు అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు సూచనలు

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేశారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేరుగు నాగార్జున అన్నారు. సోమవారం సాయంత్రం సంతనూతలపాడులో మండల స్థాయి పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులతో పరిచయ కార్యక్రమంతో పాటు పలు శాఖల అధికారులతో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి నాగార్జున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాల వలన లబ్ధిపొందని కుటుంబమే లేదన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితేనే ఆయన అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. కార్యకర్తలందరినీ కలుపుకుపోతానని, వారికి అండగా నిలుస్తానని, నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జెండాను ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. కార్యకర్తలు చేపట్టిన అభివృద్ధి పనులకు రావాల్సిన బిల్లులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి చెల్లింపులకు తన వంతు కృషి చేస్తానన్నారు. మండలంలో చేయాల్సిన అభివృద్ధి పనులను ఎన్నికల కోడ్ వచ్చేలోపు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం శాఖల వారీగా మండలంలో చేస్తున్న పలు అభివృద్ధి పనులు, పురోగతిపై సమీక్షించారు. నిర్మాణం పూర్తయిన సిండికేట్ రైతు భవనం, జిల్లా పరిషత్ హైస్కూలులో నిర్మించిన ఇండోర్ స్టేడియం, జగనన్న కాలనీలోని సదుపాయాలను పరిశీలించారు. తొలుత మంత్రి మేరుగు నాగార్జునకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బీ.విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, సొసైటీ ప్రెసిడెంట్ దుంపా యలమందారెడ్డి ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛాలు అందించి మంత్రి నాగార్జునకు స్వాగతం పలికారు. గ్రామాల వారీగా నాయకులను దుంపా చెంచిరెడ్డి మంత్రికి పరిచయం చేశారు. కార్యక్రమంలో ఒంగోలు కార్పొరేషన్ మేయర్ గంగాడ సుజాత, పార్టీ సీనియర్ నాయకులు బొల్లినేని కృష్ణయ్య, గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి, సంతనూతలపాడు సర్పంచ్ దర్శి నాగమణి, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు జీ.తిరుపతిరావు, పేర్నమిట్ట పరిధిలోని కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మెప్మా పీడీ రవికుమార్, ఎంపీఈఓ కే.రాఘవేంద్ర, ఇతర శాఖల అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన కార్యకర్తలు, పలు శాఖల అధికారులు

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

- స్పందన నిర్వహించిన జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు



స్పందనలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు సూచించారు. స్పందన హాలులో స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం ద్వారా దూర ప్రాంత ప్రజల సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులకు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించడంతో పాటు నాణ్యమైన పరిష్కారం చేయాలన్నారు. సమస్యలు పునరావృతం కాకూడదన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి చిత్తశుద్ధితో పరిష్కరించాలని సూచించారు. పరిష్కరించలేని సమస్యలు ఉంటే అర్జీదారులను పిలిచి వారికి అర్థమయ్యేలా వివరించాలన్నారు. దీనిలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లోకేశ్వరరావు, వరప్రసాద్, ఝన్సీలక్ష్మి, మాధురి ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

- కనిగిరి మండలం పునుగోడు గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి డయల్ యువర్ కలెక్టర్‌కు ఫోన్ చేసి తన భూమి సర్వే నంబర్ 272లో ఖాతా నంబర్ 1206 ఉందని అయితే ఆన్‌లైన్‌లో 1బి రావడం లేదని తెలిపాడు. పరిశీలించి ఆన్‌లైన్‌లో వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరగా కనిగిరి తహశీల్దార్‌ను పరిష్కరించాలని ఆదేశించారు.
- పొన్నలూరు మండలం రెడ్డిపాలెం గ్రామానికి చెందిన దత్తాత్రేయ తనకు వైఎస్ఆర్ జలకళ పథకాన్ని వర్తింపచేయాలని కోరాడు. స్పందించిన జేసీ డ్వామా పీడీకి తగిన ఆదేశాలు ఇచ్చారు.

ప్రతి విద్యార్థి ర్యాంకులు సాధించాలనేదే లక్ష్యం

- స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో మంత్రి ఆదిమూలపు



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ (టంగుటూరు): ప్రతి విద్యార్థి రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించాలనే లక్ష్యంతో తన స్వంత నిధులు రూ.5 లక్షలతో పదో తరగతి విద్యార్థులకు ఇంగ్లిషు, తెలుగు మీడియంలలో స్టడీ మెటీరియల్ తయారు చేయించి పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాలులో సోమవారం విజయసాధన కార్యక్రమంలో భాగంగా పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మంత్రి సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో 28 వేల మంది పదో తరగతి చదువుతుండగా కొండపి నియోజకవర్గంలో 2,118 మంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్నారన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ ద్వారా మొదటిబ్యాచ్ ఈ సంవత్సరం మొదటి పరీక్ష రాస్తుందని గుర్తు చేశారు. గత పాలకులు విద్యను నిర్లక్ష్యం చేశారని మీకు ఓటు లేదు అప్పుడు మీతో అవసరం లేదన్నదే వారి ఉద్దేశమని ప్రతిపక్షాల పనితీరును ఎండగట్టారు.

బడ్జెట్‌లో 15 శాతం విద్యపై ఖర్చు:

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల విషయంలో ఓటుబ్యాంకు రాజకీయం చేయలేదని పేదరికంపై యుద్ధం ప్రకటించి ప్రతి విద్యార్థి బాగా చదువుకునేలా బడ్జెట్‌లో 15 శాతం కేటాయించి రూ.35 వేల కోట్లు ఖర్చు చేశారని కొనియాడారు. రాబోయే ఏప్రిల్ నెలలో నాకు కూడా పెద్ద పరీక్ష ఉందని, నా జీవితంలోనే అతి పెద్ద పరీక్ష అని మంత్రి సురేష్ అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అభినందించేలా మంచి మార్కులతో గెలవాలన్నదే నా లక్ష్యమన్నారు. తాను ఇప్పుడు ప్రతి రోజు 20 గంటలు కష్టపడుతున్నానని చెప్పారు. అంతకుముందు మంత్రి సురేష్ సరస్వతి దేవి విగ్రహానికి పూజలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ యన్నాబత్తిన అరుణ, జిల్లా విద్యాశాఖాధికారి వీ సుబ్బారావు, ఎంపీపీలు కట్టా శోభారాణి, పటాపంజుల కోటేశ్వరమ్మ, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి, వైస్ ఎంపీపీ, పార్టీ మండల అధ్యక్షుడు సామంతుల రవి కుమార్‌రెడ్డి, సర్పంచ్ తాటిపర్తి వనజ, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి యన్నాబత్తిన చిన్నా, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి శీలం రాము, ఎంఈఓలు బీ శివన్నారాయణ, బీ నాగేంద్రవదన్, ఆవుల శ్రీనివాసరావు, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, కనుమళ్ల సొసైటీ చైర్మన్ మలినేని వెంకటేశ్వర్లు, షేక్ పటేల్, పార్టీ జిల్లా నాయకులు షేక్ సుల్తాన్‌బాషా, పఠాన్ రియాజ్, షేక్ కరీం, పి శ్రీనివాసులరెడ్డి, సీహెచ్ వెంకటేశ్వర్లు, మసనం వెంకట్రావు, ఎంపీడీవో షేక్ జమీఉల్లా, తహశీల్దార్ సీహెచ్ ఉష, ప్రిన్సిపాల్ డీ జయ, పీఎన్‌సీఏ కాలేజి కరస్పాండెంట్ పీ గీతారాణి, షేక్ జూలీ, షేక్ సలీంబాషా, షేక్ సలీం పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం జగనన్నతో సాకారం



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి



గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తూ..

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- చింతగుంటలో సచివాలయం, ఆర్బీకే ప్రారంభం

కొనకనమిట్ల: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాల వ్యవస్థను తీసుకొచ్చారని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చింతగుంట గ్రామంలో ఆయన మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, గ్రామ సర్పంచ్ ప్రసాద్‌రెడ్డితో కలిసి నూతన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. వారికి గ్రామ పార్టీ కన్వీనర్ ఎంఆర్ఎఫ్ వెంకటేశ్వరరెడ్డి, స్థానిక నాయకులు మేళతాళాలు, పూలతో ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల వద్దకే పాలన నినాదంతో ప్రతి పనికి కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఒకే చోట సమస్యల పరిష్కారమయ్యేలా సచివాలయ వ్యవస్థను రూపొందించారన్నారు. మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలన్నీ నెరవేర్చిన జగనన్నను మరోమారు ఆశీర్వదించాలని కోరారు. తొలుత వేద పండితుడు విజయ్‌కాంత్‌శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి, పీఆర్ డిఈ శ్రీధర్‌రెడ్డి, ఏఈ నిరంజన్, సొసైటీ చైర్మన్ కామసాని వెంకటేశ్వర్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సూరవరపు పెదవెంకటరెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం కన్వీనర్ ఏలూరి సంజీవరెడ్డి, సీసీకెఆర్ శ్రీను, గొలమారి తిరుతిరెడ్డి, ఎంఆర్ఎఫ్ వెంకటేశ్వరరెడ్డి, వేమన కృష్ణారెడ్డి, పకీర్‌రెడ్డి, శ్రీరామ్ శ్యాంసన్, ఆర్.గురవయ్య, కల్లం దిబ్బారెడ్డి, పునుగోటి కొండారెడ్డి, ఉన్నం శ్రీనివాసులు, బైరెడ్డి కొండారెడ్డి,సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

దద్దాల అందరివాడు.. గెలిపించుకుందాం



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి

- పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి

పీసీపల్లి: దద్దాల నారాయణ అందరివాడు. సమష్టిగా పనిచేసి గెలిపించుకుందామని పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి నియమితులైన దద్దాల నారాయణ తొలిసారి పీసీపల్లికి వచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని వైఎస్సార్ సీపీ నేతలు, నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్ భవన్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండలానికి చెందిన పార్టీ నేతలను కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి పేరుపేరున పరిచయం చేశారు. అనంతరం జరిగిన కార్యకర్తలు, నాయకులతో కలిసి బహిరంగ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్‌చార్జిగా సామాన్య వ్యక్తి అయిన దద్దాల నారాయణను నియమించడం ఆనందంగా ఉందన్నారు. సీఎం జగన్ నిర్ణయం ప్రతి ఒక్కరికీ శిరోధార్యమన్నారు. కులాలకతీతంగా ప్రతి ఒక్కరూ రానున్న ఎన్నికల్లో దద్దాల నాయకత్వానికి బలపర్చాలన్నారు.

మీలో ఒక్కడిని..ఆదరించండి

సీఎం జగన్, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిల ఆశీర్వాదంతో తాను కనిగిరి నియోజకవర్గ బాధ్యతలు తీసుకున్నానని, తాను సామాన్య వ్యక్తినని.. మీలో ఒక్కడినని..ఆదరించాలని దద్దాల నారాయణ కోరారు. రానున్న ఎన్నికల్లో అందరం సమష్టిగా ముందుకు సాగి కనిగిరిపై మరోసారి వైఎస్సార్ సీపీ జెండా ఎగరేసి జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. ఎంపీపీ అత్యాల జివన్య మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం శిరోధార్యమని, అందరం కలిసికట్టుగా దద్దాలకు భారీ మెజారిటీతో గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీల సంఘ జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు మడతల కస్తూరిరెడ్డి, పీసీపల్లి జెడ్పీటీసీ పెద్దిరెడ్డి లక్ష్మీకాంతం ఓకేరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి, సర్పంచ్ మరియమ్మ, సింగిల్ విండో చైర్మన్ పోలు జయరామిరెడ్డి, అలవల నరసింహారెడ్డి, మురుగమ్మి సర్పంచ్ నల్లగంగుల శ్రీనివాస్ యాదవ్, ముద్దపాడు సర్పంచ్ మూలె రాజశేఖర్ రెడ్డి, వెంకట్రావ్, ఎంపీటీసీ భాస్కర్, మాజీ సింగిల్ విండో నూరసాని మోహన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఖోఖో క్రీడాకారుడు మృతి

జే.పంగులూరు: మండల పరిధిలోని కొండమూరు గ్రామానికి చెందిన ఖోఖో జాతీయ క్రీడాకారుడు వెంకటరెడ్డి (46) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడు వెంకటరెడ్డి ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో ఖోఖో శిక్షణ తీసుకొని 20 సార్లు జాతయ స్థాయి పోటీల్లో పాల్గొని అనేక పతకాలు సాధించాడు. స్పోర్ట్స్ కోటాలో స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఉద్యోగం సాధించాడు. అనారోగ్యంతో గతంలో ఉద్యోగానికి రాజీనామా చేశాడు. ఆయన మృతి పట్ల రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ సభ్యులు, ఇండియన్ ఖోఖో అసోసియేషన్ సభ్యులు నివాళులర్పించారు. పంగులూరులో జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ క్రీడాకారులు వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



వెంకటరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఖోఖో క్రీడాకారులు

10న నవోదయ ప్రవేశ పరీక్ష

ఒంగోలు: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ సమితిలో 9, 11వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు ఫిబ్రవరి 10వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రవేశ పరీక్ష ప్రారంభమవుతుందన్నారు. ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కామన్ సర్వీస్ సెంటర్లలో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. తమ విద్యాలయం ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఫిబ్రవరి 6వ తేదీలోగా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోగా పొందవచ్చని తెలిపారు. వివరాలకు 9481837230, 8638682701ను సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

యువకుడిపై కత్తితో దాడి

గిద్దలూరు రూరల్: క్రికెట్ ఆడే విషయంలో ఓ యువకుడిపై మరో వ్యక్తి కత్తితో దాడి చేసి గాయపరిచిన సంఘటన మండలంలోని కేఎస్ పల్లె గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వెంకటేష్ అనే యువకుడికి పునీత్, ప్రణీత్‌కు మధ్య క్రికెట్ ఆడే విషయంలో వివాదం తలెత్తింది. ఈ విషయాన్ని పునీత్, ప్రణీత్ తమ తండ్రి రాజుకు చెప్పడంతో ఆవేశానికి గురై వెంకటేష్‌పై కత్తితో దాడికి పాల్పడ్డాడు. బాధిత యువకుడి ఫిర్యాదు మేరకు రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గాయపడిన వెంకటేష్‌ను బంధువులు చికిత్స నిమిత్తం కర్నూలులోని ఓ వైద్యశాలకు తరలించారు.

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.1.13 లక్షలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రు.1,12,957 ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈవో జి.రమణారెడ్డి సోమవారం తెలిపారు. స్వామివారి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రు.50,430, లడ్డూ ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.22,620, ఆలయంలో శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రు.39,907 వచ్చినట్లు వివరించారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరం



మహాశివరాత్రి వసతుల పనులను పర్యవేక్షిస్తున్న చైర్మన్, ఈఓ, నాయకులు

సీఎస్‌పురం(పామూరు): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం అన్ని వసతులు కల్పనకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ జి.రమణారెడ్డి తెలిపారు. ఈసందర్భగా ఆలయ ప్రాంగణంలో ఉన్న వివిధ నిర్మాణ పనులను వారు సోమవారం స్థానిక సర్పంచ్ ఖాదర్‌బీబుజ్జితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహాశివరాత్రికి భక్తులు ఆలయానికి పెద్దసంఖ్యలో తరలివస్తారన్నారు. ఈసందర్భంగా ఆలయంలో తాగునీటి వసతి, భోజన వసతి, వసతి సదుపాయం, ఆధ్మాత్మిక కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, క్యూలైన్‌ల ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, వైద్యసేవలు మొదలైన వాటిపై చర్చించారు. కార్యక్రమంలో కొమ్మినేని వెంకట్రావు, నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు కనిగిరి విద్యార్థులు




మనోజ్‌కుమార్‌రెడ్డి



రేగలగడ్డ గురవమ్మ

కనిగిరి రూరల్: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ఖోఖో సంఘం జిల్లా కార్యదర్శి బి.కాశీ విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు జార్ఖండ్‌లోని రాంచీలో నిర్వహించనున్న 67వ జాతీయస్థాయి అండర్ 14 స్కూల్ గేమ్స్‌లో మండలంలోని కంచర్లవారిపల్లి, పాతపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు తమ్మినేని మనోజ్ రెడ్డి, రేగల గడ్డ గురవమ్మలు ఎంపికయ్యారు. వీరు గత పదిరోజులుగా చిత్తూరు జిల్లా క్రీడా సాధికార సంస్థలో శిక్షణ పొందుతున్నారు. క్రీడాకారులతోపాటు, పీడీ, పీఈటీలను జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వనజ అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు విజయ భాస్కర్‌రెడ్డి, బి.ఇందిర, పీఈటీ సావిత్రమ్మ, పీడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

48 మద్యం సీసాలు స్వాధీనం



గుడ్లూరు పోలీస్‌స్టేషన్‌లో పట్టుకున్న మద్యం సీసాలతో ఎస్సై రాములు

గుడ్లూరు: అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రాములు తెలిపిన వివరాల ప్రకారం.. కందుకూరు మండలం మాచవరం గ్రామానికి చెందిన గడే శ్రీను ఎటువంటి అనుమతులు లేకుండా గుడ్లూరులో మద్యం దుకాణం నుంచి అక్రమంగా మద్యం కొనుగోలు చేసుకొని మోటారు బైక్‌పై వెళుతుండగా సమాచారం అందుకున్న ఎస్సై రాములు తన సిబ్బంది భాస్కర్, రమేష్, మీరయ్య, మాధవరావులతో కలిసి పెట్రోలు బంకు వద్ద శ్రీనును అదుపులోనికి తీసుకొని అతని వద్ద నుంచి 48 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శ్రీనుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాములు తెలిపారు.

సంక్షేమ ప్రభుత్వంపై పచ్చ విషం

- రానున్న ఎన్నికల్లో టీడీపీని ప్రజలు బంగాళాఖాతంలో కలపడం ఖాయం
- సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా ఏపీ
- మంత్రి మేరుగు నాగార్జున



వెల్లంపల్లిలో స్థానిక నాయకులతో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

మద్దిపాడు: జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకుందామని సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. పచ్చ పత్రికలు రోజుకో కథనం వండి వారుస్తూ ముఖ్యమంత్రి పై విషం చిమ్ముతున్నారని విమర్శించారు. పచ్చపత్రికల కథనాల్లో డొల్లతనం, వాస్తవాలు ఏమిటో ప్రజలకు తెలుసని చెప్పారు. మండలంలోని వెల్లంపల్లి గ్రామంలో సోమవారం ఆయన గ్రామ నాయకులతో పరిచయ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీకు మేలు జరిగితేనే నాకు ఓటేయండంటూ ముఖ్యమంత్రి జగనన్న అన్నారని, దానికి అర్థం ప్రతి గడపలోను మేలు జరిగిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు గత ఎన్నికల్లో టీడీపీని 23 సీట్లకు పరిమితం చేశారని, రాబోయే ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలిచే పరిస్థితి లేదన్నారు. ఈసారి చాప చుట్టి బంగాళాఖాతంలో టీడీపీని జల సమాధి చేస్తారని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు పరుగుపెడుతోందని, ఉద్యోగాల కల్పనలో, తలసరి ఆదాయాన్ని పెంచడంలో ముందంజలో ఉందని అన్నారు. ముఖ్యమంత్రి జగనన్న మన బడి నాడు-నేడు పథకం ద్వారా పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందిస్తున్నారన్నారు. ఆర్‌బీకేల విషయంలో ఆంధ్రప్రదేశ్ దేశానికే కాకుండా ప్రపంచానికే రోల్ మోడల్‌గా నిలిచిందని అన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం ప్రతి ఒక్కరికీ అవసరమని భావించిన ముఖ్యమంత్రి ఈ మూడు రంగాల్లో విశేషంగా సేవలు అందించిందన్నారు. ఇన్ని విధాలుగా ప్రజల సంక్షేమం గురించి ఆలోచించే ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారా అంటూ ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో మరోమారు జగనన్ననే ముఖ్యమంత్రిని చేసుకుని సంక్షేమ ఫలాలు అందుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు మండవ అప్పారావు, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బెజవాడ రాము, సీనియర్ నాయకులు పిట్టల ఆంజనేయులు మోరబోయిన సంజీవరావు, గుడ్డపాతల రవి, గట్టినేని అయ్యన్న, పూనాటి చిన్న అప్పారావు, లింగా రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీలు బొమ్మల దేవదాసు, ప్రభాకర్, మాజీ సర్పంచ్‌లు సింగయ్య, జయమ్మ, గ్రామ నాయకులు సుబ్బారెడ్డి, పిచ్చిరాజు సుబ్బయ్య, హరిబాబు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చంద్రబాబును నమ్మితే మోసపోవడమే..

- టీడీపీ జమానాలో ప్రజా ధనమంతా పచ్చ నేతల జేబుల్లోకే..
- చంద్రబాబుకు దమ్ముంటే టీడీపీ ఒంటరిగా పోటీ చేయాలి
- ప్రతిపక్షాలపై ధ్వజమెత్తిన మంత్రి ఆదిమూలపు సురేష్
- బడుగు, బలహీన వర్గాలను ఆదుకుంది సీఎం వైఎస్ జగనేనని స్పష్టీకరణ
- సమష్టిగా పనిచేసి కొండపి గడ్డపై వైఎస్సార్ సీపీ జెండా ఎగరేద్దామని పిలుపు
- మర్రిపూడిలో పార్టీ శ్రేణులతో పరిచయ సమావేశం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

మర్రిపూడి: ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు చెప్పే మాటలు, ఇచ్చే అబద్ధపు హామీలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు పురపాలక, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సోమవారం కార్యకర్తల పరిచయ సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్వాక్రా సంఘాలు, రైతుల పంట రుణాలను పూర్తిగా మాఫీ చేస్తానని చెప్పి 2014లో గద్దెనెక్కిన చంద్రబాబు నిలువునా మోసం చేశారని గుర్తుచేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలను నాలుగు విడతల్లో పూర్తిగా చెల్లించారన్నారు. గడిచినా నాలుగున్నరేళ్లలో డీబీటీ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో 2.50 లక్షల కోట్ల రూపాయలు జమ చేశారని పేర్కొన్నారు. టీడీపీ హయాంలో పచ్చ నేతలు జేబులు నింపుకొనేందుకే కొన్ని పథకాలు ఉండేవన్నారు. వికలాంగ, వృద్ధాప్య, వితంతు పింఛను రావాలంటే జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకుని, గంటల తరబడి కార్యాలయాల వద్ద వేచి చూడాల్సిన దుస్థితి ఉండేదని గుర్తు చేశారు. చంద్రబాబు పాలన మొత్తం అవినీతిమయమని విమర్శించారు. రాష్ట్రంలో 3,648 కి.మీ మేర పాదయాత్ర చేసిన జగన్.. ప్రజల కష్టాలు తొలగించేందుకు నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ, ప్రజాసేవే అజెండాగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. తనను వలస పక్షి అని చంద్రబాబు చేసిన విమర్శలను మంత్రి సురేష్ తిప్పికొట్టారు. 'నేను వలసపక్షి అయితే నీవు జైలుపక్షివా' అని చంద్రబాబును సూటిగా ప్రశ్నించారు. దమ్ముంటే జనసేనతో కలవకుండా ఒంటరిగా పోటీ చేయాలని చంద్రబాబుకు సవాల్ విసిరారు. ఓటమి భయంతో కులాల మధ్య బాబు చిచ్చు పెడుతున్నాడని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. దళితుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచేలా విజయవాడ నడిబొడ్డున ప్రపంచంలోనే ఎత్తయిన అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం వైఎస్ జగన్ ఏర్పాటు చేశారని కొనియాడారు. అందరం కలిసికట్టుగా పనిచేసి కొండపి గడ్డపై వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. ముందుగా పృథులగిరి లక్ష్మీనృసింహస్వామివారిని మంత్రి దర్శించుకుని, పూజలు చేశారు. అనంతరం రూ.8 కోట్లతో మంజూరైన ఘాట్ రోడ్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దొద్దాలి మల్లికార్జున, చిమట, మర్రిపూడి సొసైటీ అధ్యక్షుడు ఎం.వెంకట్రావు, బోగసముద్రం విజయభాస్కర్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు ఇనుకొల్లు పిచ్చిరెడ్డి, బీవీ భాస్కర్‌రెడ్డి, బోద రమణారెడ్డి, మాచేపల్లి నాగయ్య, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పి.సంజీవరెడ్డి, ఇనుకొల్లు మాదిరెడ్డి, సర్పంచ్ కె.భాస్కర్, బొగ్గుల శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆలయంలో పూజల అనంతరం పార్టీ నేతలతో మంత్రి సురేష్

జగనన్న మాట శిలా శాసనం

- ఇచ్చిన మాటకు కట్టుబడి నాలుగు విడతలుగా వైఎస్సార్ ఆసరా
- నామినేటెడ్ పదవుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ సీఎం జగన్ ఘనతే
- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి
- 1764 డ్వాక్రా సంఘాలకు రూ.16.63 కోట్ల చెక్కులు పంపిణీ



డ్వాక్రా రుణమాఫీ చెక్ అందిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి

దర్శి: 'రాష్ట్రానికి మహిళలే మహాశక్తి.. మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ముఖ్య ఉద్దేశంతో ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి నాలుగు విడతలుగా రూ.25,571 కోట్ల డ్వాక్రా రుణాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాఫీ చేశారు. జగనన్న మాటిస్తే శిలాశాసనమే' అని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో స్థానిక తాలూకా క్లబ్ సమావేశం హాలు ప్రాంగణంలో నిర్వహించిన సభలో వారు మాట్లాడారు. దర్శి మండలంలో 1266 స్వయం సహాయక సంఘాలకు రూ.10,98,63,000, దర్శి పట్టణంలోని 498 గ్రూపులకు రూ.4,65,18,875 చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ, శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ చరిత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడింది నాడు వైఎస్సార్, నేడు వైఎస్ జగన్ మాత్రమేనని చెప్పారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో వైఎస్సార్ ఆసరా, కాపునేస్తం లాంటి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రిజర్వేషన్ కల్పించింది కూడా జగనన్న మాత్రమేనన్నారు. ఇచ్చిన మాట మీద నిలబడి హామీలు అమలు చేసిన నాయకుడు కావాలా..? అబద్ధపు హామీలిచ్చి మేనిఫెస్టోను ఆన్‌లైన్‌లో లేకుండా మాయం చేసిన చంద్రబాబు కావాలో నిర్ణయించుకోవాలని సూచించారు. గత 20 ఏళ్లుగా బూచేపల్లి కుటుంబం ప్రజా సేవకు అంకితమైందని, శివప్రసాద్‌రెడ్డిని మీ సొంత తమ్ముడిలా భావించి ఆదరించాలని మహిళలకు వెంకాయమ్మ విజ్ఞప్తి చేశారు. ఎలాంటి సమస్యలున్నా దర్శిలోని తన ఇంటికి వచ్చి నేరుగా చెప్పాలని శివప్రసాద్‌రెడ్డి సూచించారు. ముందుగా వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డికి మహిళలు ఘన స్వాగతం పలికారు. డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. వైఎస్సార్ ఆసరా పేరుతో మహిళలు పూలతో ఏర్పాటు చేసిన డిజైన్లను తిలకించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మహిళల కోలాట ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. అధిక సంఖ్యలో హాజరైన మహిళలందరికీ భోజన వసతి కల్పించారు.

కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ డైరెక్టర్, వైద్య విభాగం రాష్ట్ర అధికారప్రతినిధి డాక్టర్ ఎస్ఎం బాషా, ఎంపీపీ సుధాఅచ్చయ్య, ఎంపీడీఓ హనుమంతరావు, నగర పంచాయతీ కమిషనర్ మహేష్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి రవికుమార్, ఏరియా కోఆర్డినేటర్ వసుంధర, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, సర్పంచ్‌లు కేసరి రాఘూపాల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రాము, రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతి రెడ్డి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు మారెడ్డి సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కేవీ రెడ్డి, కౌన్సిలర్లు మేడం మోహన్‌రెడ్డి, జగన్నాథం మోహన్‌బాబు, మజ్జువలి, జగన్, నరసింహారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాయకులు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



భారీగా హాజరైన డ్వాక్రా మహిళలు

వైఎస్సార్ సీపీకి మెండుగా ప్రజాదరణ



సర్వాయపాలెం ప్రభపై మాట్లాడుతున్న తాటిపర్తి చంద్రశేఖర్

- అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే జగనన్న ధ్యేయం
- బడుగు, బలహీన వర్గాలంటే ఆయనకెంతో ప్రీతి
- వెలిగొండను పూర్తి చేసి వైఎస్సార్ కలను నెరవేర్చిన తనయుడు
- వై.పాలెం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే జగనన్న ధ్యేయమని, నవరత్నాల పథకాలను ప్రవేశ పెట్టి కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఇంటికి చేర్చిన ఘనత ఆయనకే దక్కుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని నరసాయపాలెం, అయ్యంబొట్లపల్లె, త్రిపురాంతకం మండలం ఎండూరివారిపాలెం, సోమేపల్లి గ్రామాల్లో జరిగిన గుత్తికొండ రామయోగి స్వామి తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలపై నుంచి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అక్కున చేర్చుకున్నారని, జగనన్నను తిరిగి సీఎంగా చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. బడుగు, బలహీన వర్గాలంటే ఆయనకెంతో ప్రీతి అని, వారి అభ్యున్నతికి ఆయన ఎనలేని కృషి చేస్తున్నారని, అన్ని రంగాల్లో రాణించేందుకు ఆర్థిక సహాయం అందచేస్తున్నారని పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి వైఎస్సార్ కలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని, ప్రాజెక్టు పూర్తి కావడంతో కరువు, కాటకాలతో అలమటించి పోతున్న పశ్చిమ ప్రకాశం ప్రాంతం సస్యశ్యామలం కాబోతుందన్నారు. టీడీపీ వర్గీయులకు ప్రాజెక్టు పూర్తి చేయడం ఏ మాత్రం ఇష్టం లేదని ఆయన విమర్శించారు. 2014–19 సంవత్సర కాలంలో అధికారంలో ఉన్న చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టును ఏ మాత్రం పట్టించుకోలేదని, కొద్దో గొప్పో నిధులు మంజూరు చేసి తమ వర్గీయుల జేబులు నింపారన్నారు. అవ్వా, తాతలు జగన్‌మోహన్‌రెడ్డిని మనసారా ఆశీర్వదిస్తున్నారని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, మండల పార్టీ అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాల గురవయ్య, ఏఎంసీ డైరెక్టర్ కందుల సత్యనారాయణ, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, నాయకులు ఎస్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, బి.బాలచెన్నయ్య, త్రిపురాంతకం మండలంలో జరిగిన కార్యక్రమాల్లో ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సింగారెడ్డి పోలిరెడ్డి, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ చల్లా ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నేతల వర్గపోరు బహిర్గతం

- చెన్నంపల్లిలో పోటాపోటీగా విద్యుత్ ప్రభలు

యర్రగొండపాలెం: తెలుగుదేశం పార్టీ నాయకుల్లో ఉన్న వర్గపోరు బహిర్గతమైంది. పుల్లలచెరువు మండలం చెన్నంపల్లిలో జరిగిన గుత్తికొండ రామయోగి స్వామి తిరునాళ్ల సందర్భంగా ఆదివారం రాత్రి విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. ఆ గ్రామంలో పోటాపోటీగా విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పుల్లలచెరువు మండలంతో పాటు యర్రగొండపాలెం, త్రిపురాంతకం మండలాల్లో ముమ్మరంగా ప్రచారం కొనసాగింది. చెన్నంపల్లిలో తిరునాళ్ల ఆర్భాటంగా జరుగుతుందని ఆయా ప్రాంతాల నుంచి రామయోగి స్వామి భక్తులు, అభిమానులు ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. అక్కడికి వెళ్లి ప్రభలను చూసిన వారు అవాక్కయ్యారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్గీయులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ దేదీప్యమానంగా వెలుగొందుతుంటే పచ్చనేతలు ఏర్పాటు చేసిన రెండు ప్రభల వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. టీడీపీలో ఉన్న రెండు వర్గాలకు చెందిన నాయకులు చెరొక ప్రభ ఏర్పాటు చేసుకొని ఊకదంపుడు ప్రసంగాలు మొదలు పెట్టారు. చెన్నంపల్లెలో జరుగుతున్న తిరునాళ్ల సందర్భంగా ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు విద్యుత్ ప్రభ ఏర్పాటు చేసేందుకు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, డాక్టర్ మన్నె రవీంద్రల వద్దకు వెళ్లారు. ఎరిక్షన్‌బాబు కాలుపెట్టిన ప్రభపై తాను ఎక్కనని రవీంద్ర చెప్పడంతో పాటు కొంత నగదు వారికిచ్చి మరో ప్రభ ఏర్పాటు చేయాలని హుకుం జారీ చేశారు. గ్రామంలో రెండు పచ్చ ప్రభలు వెలుగొందుతాయన్న ఆ పార్టీకి చెందిన యువత హుషారుగా రెండు ప్రభలను ఏర్పాటు చేశారు. నాయకులు మాత్రం తమ బలాన్ని చూపించేందుకు తమ అనుచరులను వెంటేసుకొని అక్కడికి వెళ్లారు. రవీంద్ర మాత్రం దాదాపు 25 కార్లలో వెళ్లి తన బలం ఏంటో నిరూపించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో ఎప్పుడు ఏం జరుగుతుందోనని టీడీపీ కార్యకర్తలు, పోలీసులు ఆందోళన చెందాల్సి వచ్చిందని ఆ పార్టీకి చెందిన ఒక నాయకుడు తెలిపాడు.

నర్సింగ్ విద్యార్థులకు బీసీఎల్ఎస్ కోర్సు తప్పనిసరి



లైఫ్ సపోర్టు కోర్సులో శిక్షణ పొందుతున్న నర్సింగ్ విద్యార్థులు

ఒంగోలు టౌన్: నర్సింగ్ విద్యనభ్యసిస్తున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బేసిక్ కార్డియో పల్మనరీ లైఫ్ సపోర్ట్ కోర్సు(బీసీఎల్ఎస్) తప్పనిసరిగా పూర్తి చేయాలని ప్రభుత్వం నిబంధన విధించిందని జీజీహెచ్ సూపరెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఏడుకొండలు తెలిపారు. జీజీహెచ్‌లో నర్సింగ్ విద్యార్థులకు అనస్తీషియా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను వారు పరిశీలించారు. కోర్సులో భాగంగా థియరీ, ప్రాక్టికల్స్ శిక్షణను పరిశీలించిన అనంతరం డాక్టర్ ఏడుకొండలు మాట్లాడుతూ.. ప్రమాదాలు, గుండెపోటు, ఇతర అత్యవసర సమయాల్లో బేసిక్ లైఫ్ సపోర్ట్ ప్రాణాలు కాపాడుతుందని చెప్పారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ రీసెర్చ్ ఫెడరేషన్ చైర్మన్ చక్రరావు, నర్సింగ్ రిజిస్ట్రార్ సుశీల నేతృత్వంలో ప్రభుత్వం ఈ ప్రోగ్రామ్స్‌ను రూపొందించిందని వివరించారు. నర్సింగ్ విద్యార్థులు అత్యవసర సమయాల్లో ఎక్కడైనా సరే వైద్య సేవలు అందించేందుకు శిక్షణ దోహదపడుతుందని అనస్తీషియా హెచ్ఓడీ రాజ సుందరం చెప్పారు. కోర్సులో శిక్షణ పొందిన సర్టిఫికెట్ ఉంటేనే నర్సింగ్ కౌన్సిల్లో రిజిస్టర్ అయ్యేలా ప్రభుత్వం ఆదేశాలిచ్చిందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జీజీహెచ్ వైద్యులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ త్రినాథ్, డాక్టర్ చలపతి, డాక్టర్ ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎడ్ల బండలాగుడు పోటీలు



బండ లాగుతున్న ఎడ్లు

కురిచేడు: గుత్తికొండ రామయోగితాత ఆరాధన ఉత్సవాల సందర్భంగా కురిచేడు మండలంలోని పొట్లపాడు గ్రామంలో ఎడ్ల బల ప్రదర్శన పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఆలయ కమిటీ, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ పోటీలను సోమవారం ధర్మకర్త నుసుం గోవింద రెడ్డితో కలిసి చీమకుర్తికి చెందిన నుసుం గోవింద రెడ్డి, కురిచేడు ఎంపీటీసీ సభ్యుడు ఆవుల లక్ష్మీవెంకటరెడ్డి ప్రారంభించారు. జూనియర్ విభాగంలో మొత్తం 17 జతల ఎడ్లు పాల్గొన్నాయి. పోటీలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో పశుపోషకులు, రైతులు తరలివచ్చారు. ఫ్లడ్ లైట్ల వెలుగులో అర్ధరాత్రి వరకు పోటీలు కొనసాగాయి. పోతిరెడ్డి వెంకటరామిరెడ్డి, నుసుం మోపురురెడ్డి,మారం వెంకట సుబ్బారెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

यूनियन बैंक Union Bank of India

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ప్రాంతీయ కార్యాలయం, ఒంగోలు
ఆంజనేయ కాంప్లెక్స్, భాగ్యనగర్, 2వ లేన్, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523001.

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(6) నిబంధనలతో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం స్థిరాస్తుల అమ్మకం కొరకు ఈ వేలం అమ్మకం నోటీసు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8 ప్రకారం స్థిరాస్తుల అమ్మకం కొరకు 15 రోజుల అమ్మకం నోటీసు

